లాభాల బాట

- పొలంలో కాలిబాటలతో ఎంతో మేలు
- పంట దిగుబడి పెరిగే అవకాశం
- వరి సాగులో ఖర్చు ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు

రావులపాలెం: వరిసాగులో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా పైరుకు చీడపీడల సమస్య ఉండదు. పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుంది. అయితే చాలా మంది రైతులు కాలిబాటలు వేయడానికి తటపటాయిస్తుంటారు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తారు. ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.1500 ఖర్చవుతుంది. అయితే దిగుబడిలో సుమారు నాలుగు బస్తాల వరకు పెరుగుదల కనిపిస్తుంది. రైతులు తప్పనిసరిగా వరి చేలల్లో కాలిబాటలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీలావణ్య చెబుతున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపు వరకూ సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న చోట నాటుకోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాలిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక బాట వేయాలి. కొందరు రైతులు ప్రతి 6 నుంచి 7 మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్కు చేసిన చోట ఉన్న మొక్కలను తీసి వేసి కాలిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో అయితే పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెంటీమీటర్ల వెడల్పులో వరి నాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.

ప్రయోజనాలు

- కాలిబాటతో పైరు మొదళ్ల వరకూ వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంత వరకూ తగ్గుతుంది.
- కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగుళ్లు గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు కాలిబాటలు ఉపయోగపడతాయి. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రతి కూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేల్లో మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ తీసుకునే వీలు కలుగుతుంది.
- కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తొలకరి పంటలో 25,034 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఆలమూరు 9 వేల ఎకరాలు, ఆత్రేయపురం 4,494 ఎకరాలు, రావులపాలెం 4,728 ఎకరాలు, కొత్తపేట 6,812 ఎకరాల్లో వరి సాగవుతుంది. ప్రస్తుతం వరి చేలు పిలక దశలో ఉన్నాయి.


ఈతకోటలో కాలిబాటలు వేసిన పొలం

తెగుళ్లను సులువుగా గుర్తించవచ్చు



ప్రతి పంటలో వరిలో కాలిబాట వేసి సాగు చేస్తున్నాను. దీని వల్ల పైరుకు పొలం మధ్యలో తెగుళ్లు, చీడపీడలు ఆశించినా గుర్తించే వీలుంటుంది. పురుగు మందులు, ఎరువులు వేయడానికి ఉపయోగంగా ఉంటుంది. ఈ సార్వాలో కూడా పొలంలో కాలిబాటలు వేసుకున్నాను.

– మట్టా దుర్గారావు, రైతు, ఈతకోట

ఎంతో ప్రయోజనకరం



కాలిబాటలు వేయడంతో దిగుబడి ఏ మాత్రం తగ్గదు. పైగా రెండు, మూడు బస్తాలు అదనంగా వస్తుంది. కాలిబాటల వల్ల సస్యరక్షణ చర్యలు తీసుకోవడం సులభమవుతుంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, రావులపాలెం

అబద్ధం, మోసం చంద్రబాబు లక్షణం


తొండవరంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


గుబ్బలపాలెంలో పార్టీ జెండా ఎగురవేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

అంబాజీపేట: అధికారం కోసం అడ్డదారులు తొక్కడం, అబద్ధం, మోసం చంద్రబాబుకు పుట్టుకతో వచ్చిన లక్షణమని జెడ్పీటీసీ, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన తొండవరం వెన్నపువారిపేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పరిశీలకుడు కొర్లపాటి కోటబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చి మోసానికి నిలువెత్తు రూపం ఉందంటే అది చంద్రబాబు అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ విస్మరించి రాష్ట్రంలో నీచ పాలనకు నాంది పలికారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతో ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.లక్ష దాకా నష్టపోయిందన్నారు. ఈ ఏడాది తూతూ మంత్రంగా తల్లికి వందనం అమలు చేశారన్నారు. మహిళలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుకు దక్కుతుందన్నారు. రాష్ట్ర నాయకులు పీకే రావు, ఎంఎం శెట్టిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రతి ఇంటికీ తీసుకువెళ్లి వివరించి చంద్రబాబు నీతిమాలిన బుద్ధిని ఎండగట్టాలన్నారు. అనంతరం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గోసంగి కుమార స్వామి, మద్దింశెట్టి మల్లిబాబు, సాపే రాజారావు, పేరాబత్తుల కొండలరావు, పితాని శ్రీనివాస్, నాగాబత్తుల రవిప్రసాద్, గోసంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై రూ.30 వేల కోట్ల విద్యుత్ భారం

మలికిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలపై రాష్ట్ర వ్యాప్తంగా రూ.30 వేల కోట్ల విద్యుత్ బిల్లుల భారం మోపిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం ఇరుసుమండ, గూడపల్లి గుబ్బలపాలెం గ్రామాల్లో పార్టీ గ్రామశాఖల అధ్యక్షుల అధ్యక్షతన చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ కార్యక్రమంలో ఇంటింటికీ వంచన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. ముందుగా సూర్యారావు స్థానిక నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గొల్లపల్లి మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ బిల్లులు తగ్గిస్తానని చెప్పి, అధికారంలోకి రాగానే బాదుడే బాదుడు అంటూ విద్యుత్ చార్జీలు పెంచేశారని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు.

కార్యక్రమంలో పార్టీ మండలం అధ్యక్షుడు బ్రహ్మాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, మండపేట నియోజకవర్గం పరిశీలకుడు ఆదిత్య కటకంశెట్టి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చింత ప్రసాద్, మోకా సురేష్, జాషువా, తాడి సహదేవ్, యల్లమిల్లి రామారావు, కొంబత్తుల సూర్యనారాయణ, కొంబత్తుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరినాట్లు


కడలిలో ముంపునకు గురైన వరినాట్లు

రాజోలు: వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. కడలి, వేగివారిపాలెం, తాటిపాక, చింతలపల్లి, రాజోలు గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో 111 మంది రైతులు వేసిన వరినాట్లు పూర్తిగా నీటమునిగాయి. సోంపల్లి, వాద్రేవుపల్లి, కడలి, చింతలపల్లి డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ డ్రైన్ల వెంబడి ఉన్న పంటపొలాల్లోకి నీరు వెనక్కి ప్రవహించడంతో పూర్తిగా వరినాట్లు ముంపులో ఉన్నాయి. వరినాట్లు, పిలకదశలో ముంపునకు గురైతే వరినాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ముంపునకు గురైన వరి పొలాలను మార్టేరు వరి పరిశోధన ప్రాంతీయ కార్యాలయం ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి, సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి మధుకుమార్‌లు ముంపునకు గురైన వరి పొలాలను సందర్శించారు. ముంపునీరు త్వరితగతిన దిగేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఐదు రోజుల పాటు ముంపునీరు ఉన్నా వరినాట్లకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. ముంపునీరు తొలగించిన తర్వాత ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలన్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి


పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి.

మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మన జిల్లాకు సరిహద్దులో ఉన్న ఆనగర్లంక, సిర్రావారిలంక, పెదమల్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

మితిమీరిన కక్ష సాధింపు చర్యలు

జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి


పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు మితిమీరిపోయాయని మాజీ ఎమ్మెల్యే జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం ఆత్రేయపురంలో పాపన్న గౌడ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, గౌడ కులస్తులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నాడు అసమానతల సమాజంలో బడుగు బలహీన వర్గాల దయనీయ పరిస్థితులను రూపుమాపేందుకు పాపన్న గౌడ్ పోరాటం సాగించారన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమంగా అందించకుండా, ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చకుండా వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఆ పార్టీ వైఖరిని తేటతెల్లం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కులమతాలు, పార్టీలు చూడకుండా అందరికీ అందించిన ఘనత పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిలువూరి రామకృష్ణంరాజు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పి.రాజగోపాల్ రాజు, ముదునూరి బండ కృష్ణంరాజు, ఆత్రేయపురం మాజీ సర్పంచ్ చిలువూరి నాగరాజు, గొట్టుముక్కల గోపిరాజు, మాజీ సొసైటీ చైర్మన్ మారిశెట్టి సత్యనారాయణ, కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


సరస్వతీదేవి విగ్రహావిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ సోమవారం ఘనంగా జరిగింది. 1996–97లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.4.50 లక్షలతో మంటపంతో పాటు సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల నడుమ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండా మల్లేశ్వరగాంధీ, నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ కడి అరుణకుమారి, కాశిన లక్ష్మీపతి, దొంగ రామ్మోహన్, దొంగ వనమయ్య పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు


తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో చంద్రరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న మానుకొండ చంద్రరావు సన్మాన సభ హెచ్ఎం పీవీ కేశవాచార్యులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ చంద్రరావు 30 ఏళ్ల పాటు అందించిన విద్యా సేవలు అమూల్యమైనవన్నారు. అనంతరం చంద్రరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు, కేతా రాజు, బొంతు భాస్కరరావు, స్టాఫ్ సెక్రటరీ గాదె శ్రీనివాసరావు, ఏవీ అప్పారావు, పాటి వెంకటేశ్వరరావు, పినిపే సత్యనారాయణ పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా దుర్గాకుమారి

అంబాజీపేట: మండల వెలుగు (డ్వాక్రా) కార్యాలయ ఏపీఎంగా ఎం.దుర్గాకుమారి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కాట్రేనికోన మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏపీఎంగా విధు లు నిర్వహించిన గంగాధర్ ఆత్రేయపురం మండలానికి బదిలీపై వెళ్లారు. సుమారు ఏడాదిగా ఇన్‌చార్జి ఏపీఎంగా శ్రీనివాస్ విధులు నిర్వహించారు. ఏపీఎం దు ర్గాకుమారి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సంఘాలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

కోనసీమ అందాల ఫొటోల ప్రదర్శన


సీనియర్ ఫొటోగ్రాఫర్ రావును సన్మానిస్తున్న తోటి ఫొటోగ్రాఫర్లు

మలికిపురం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఫొటోగ్రాఫర్లు కోనసీమ అందాల అద్భుత మైయిన ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సి.వి.రావును వేదికపై సన్మానించారు. జిల్లా అధ్యక్షులు గెడ్డం సురేష్ కుమార్, ముషిని బాబులు, న ల్లి మీనన్, నల్లి శ్రీను, కంచి ప్రసాద్, అడబాల ప్రసాద్, శేఖర్, బావ కుమార్, ప్రిన్సిపాల్ ఆనంద మహేనీ, అధ్యాపకులు రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళాలు

కొత్తపేట: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లా భైరవపట్నం గ్రామానికి చెందిన గాదిరాజు నారాయణరాజు–అరుణ దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116, ఎన్టీఆర్ జిల్లా పటమట గ్రామానికి చెందిన కటకం వెంకట శేఖర్–శాంతి దంపతుల కుమార్తె నాగ వెంకట అంజని శివశ్రీలాస్య వారి కుటుంబ సభ్యులు రూ.50,116 అందజేశారు. అనంతరం వారు స్వామిని దర్శించుకున్నారు. దాతలకు స్వామివారి చిత్రపటాలను దేవదాయ, ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు అందజేశారు.

క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావు, అచ్యుతామణి దంపతుల కుమార్తె నిమ్మకాయల లక్ష్మణ కుమార్, జ్యోతి హరిక దంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో అనంతాచార్యులు, ఖండవల్లి వెంకట రమణాచార్యుల బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణం వైభవవగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు. స్వామి వారి మొక్కుబడి కల్యాణం నిర్వహించుకునే వారు ఆలయ కమిటీ, అర్చకులను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల ఫీజు గ్రామస్తుల చెల్లింపు


ఫీజు నగదు అందిస్తున్న దాతలు భాస్కరరావు, నాగు తదితరులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సర అడ్మిషన్ ఫీజు, రెండో సంవత్సర ట్యూషన్ ఫీజులు గ్రామానికి చెందిన అడబాల శ్రీఆంజనేయులు, అడబాల భాస్కరరావు ప్రిన్సిపాల్‌కు సోమవారం అందించారు. రూ.58,605ను సర్పంచ్ యెనుముల నాగు సమక్షంలో అందించారు. నాగు మాట్లాడుతూ ఏటా ఈ దాతలే ఇలా ఫీజులు చెల్లిస్తూ కళాశాల అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.అలివేలుమంగతాయారు, ఎ.నాగరాజు, పి.నాగమణి, టి.శ్రీనివాసరావు, జె.మనోజ్‌కుమార్, పి.శివలక్ష్మ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు


రావులపాలెం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన సూరంపూడి అమ్మాజీ (69) కడుపుకి సంబంధించిన క్యాన్సర్‌తో కీమో వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికే ఐదు కీమోలు చేయించుకున్నారు. ఇంకా రేడియేషన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. పేదరికంతో అంత ఆర్థిక స్తోమత లేక స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో సూరంపూడి అమ్మాజీకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కును అందజేశారు.

విద్యార్థిని వైద్యానికి రూ.1.18 లక్షల సాయం


యువతి తండ్రికి సాయం అందజేస్తున్న మిత్రమండలి ప్రతినిధులు

మామిడికుదురు: లక్కవరంకి చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని నయనాల జాహ్నవీపుష్ప అనారోగ్యంతో బాధపడుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. మామిడికుదురుకు చెందిన వంగవీటి మోహనరంగ, రాధా మిత్రమండలి సభ్యులు సోమవారం రూ.1.18 లక్షల సాయం అందించారు. ఈ మొత్తాన్ని యువత సేకరించి యువతి తండ్రి సాంబమూర్తికి అందజేశారు. యువత, పెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంకు గణపతి ప్రతిమ బహూకరణ


రేఖాగుప్తాకు పీచుతో తయారైన గణపతి ప్రతిమ ఇస్తున్న గంగాధర్

మామిడికుదురు: పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు కొబ్బరిపీచుతో తయారు చేస్తున్న గణపతి ప్రతిమను సోమవారం ఢిల్లీ సీఎం రేఖాగుప్తాకు అందించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్ సీఎంను కలసి ఆమెకు కొబ్బరి పీచు వినాయకుని ప్రతిమను అందజేశారు. సీఎం కోనసీమ వాసులను అభినందించారు.

కలెక్టర్‌కు ఎంపీపీ ఫిర్యాదు

అంబాజీపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన తనకు ముక్కామల వైద్యాధికారి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు చేపడుతున్నారని అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనెల 12న డీవార్మింగ్ డే మాత్రల పంపిణీ విషయంలో కనీస సమాచారం లేదని అలాగే, ఈ నెల 15న జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు పిలవకుండా అవమానపరిచారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు అయిన తాను రాజకీయాలకు అతీతంగా మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని కొంత మంది అధికారులు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. ఈ విషయం తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

రేవుల్లో ప్రయాణాలు నిలుపుదల

మామిడికుదురు: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలోని రెండు ప్రధాన రేవుల్లో బోట్ల రాకపోకలను సోమవారం తాత్కాలికంగా నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్ గోగన్నమఠం, కరవాక రేవులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. రెండు రేవుల్లోనూ బోటు రాకపోకలను దగ్గరుండి నిలిపి వేయించారు. అక్కడకు వచ్చిన ప్రయాణికులను వెనక్కి తిప్పి పంపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రయాణాల రాకపోకల నిలుపుదల కొనసాగుతుందన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కొత్తపేట: మండలంలోని వానపల్లిలో శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణ బహుళ దశమి పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ పర్యవేక్షణలో తెల్లవారుజాము నుంచి ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి చక్రధర ఆచార్యుల ఆధ్వర్యంలో పెనుగొండ మండలం చెరుకువాడకు చెందిన వేద పండితులు ఖండవిల్లి సూర్యనారాయణ ఆచార్యులు రమణబాబు శిష్య బృందం స్వామివారికి, అమ్మవార్లకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను నిర్వహించారు. వానపల్లి పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఊరేగింపు

మామిడికుదురు: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదుర్రులో సోమవారం శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు ఘనంగా జరిగింది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ ఊరేగింపు ఆద్యంతం వైభవంగా నిర్వహించారు. మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ ఊరేగింపు జరిగింది. మామిడికుదురు మండల కమిటీ ఆధ్వర్యంలో వాసవీ కల్యాణ మంటపం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు ప్రారంభమయింది. ఊరేగింపులో భారీగా భక్తులు పాల్గొన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ, భక్తులు దేవరపు హనుమంతరావు, చిత్తూరు బ్రహ్మాజీ, సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి భూమి పూజ

ఆలమూరు: మండలంలోని మడికి శివారు చిలకలపాడులో నాబార్డు మంజూరు చేసిన రూ.1.14 కోట్లతో నిర్మించనున్న రహదారికి సోమవారం భూమి పూజ జరిగింది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, దొండపాటి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆలమూరు: మండలంలోని మోదుకూరుకు చెందిన లింగం శేషు (25) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని చిన్నాయిగూడేనికి చెందిన శేషు ఈ ఏడాది మే 29న మండలంలోని మోదుకూరుకు చెందిన మేరీ సుశీలను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈ ప్రేమికుల కులాలు వేరు కావడంతో శేషు కుటుంబసభ్యులు అంగీకరించలేదు. దీంతో ఆ దంపతులిద్దరూ భార్య స్వగ్రామమైన మోదుకూరు వచ్చి కాపురం సాగిస్తున్నారు. ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం స్థానికంగా ఉన్న ఒక చర్చికి వెళ్లి ప్రార్థనలు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చారు. విశ్రాంతి తీసుకుంటానంటూ శేషు గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. దీనిపై భార్య మేరీ సుశీల ఫిర్యాదుతో ఎస్సై శేషు కేసు నమోదు చేయగా రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదివారం రాత్రి మండపేట ఆస్పత్రికి తరలించారు. అయితే ఈమృతిపై శేషు కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.